# పరిపూర్ణవిద్య

ప్రొఫెసర్ బి.వి.అప్పారావు
ఎన్.ఐ.టి., వరంగల్.

2015

పరిపూర్ణవిద్య
(ప్రచురణ-2)

జనవరి, 2015

రచన :
ప్రొఫెసర్ బి.వి.అప్పారావు
ఎన్.ఐ.టి., వరంగల్

అలరు పబ్లికేషన్స్
దీపా మెమోరియల్‌ఛారిటబుల్ ట్రస్టు
విజయవాడ

ప్రతులకు :
అభ్యాస విద్యాలయం
గంగిరెద్దుల దిబ్బ
విజయవాడ
ఫోన్ 9440579922

వెల : రూ.10/-

# విద్యార్థి పరిపూర్ణ వికాసానికి దోహదం చేసే విద్య

*ప్రొ॥ బి.వి.అప్పారావు*
*ఎన్.ఐ.టి.,వరంగల్*

విద్యార్థి పరిపూర్ణ వికాసం అంటే ఏమిటో ముందు అవగాహనకు రావాలి. ప్రతి విద్యార్థీ సహజంగానే ఎన్నో శక్తియుక్తులను కలిగియుంటాడు. ఆ శక్తియుక్తులలో అతని సామర్థ్యం మేరకు పరిణతి చెందడం విద్యార్థి వికాసంలోని ఒక అంశం. జ్ఞానానికి (Knowledge) సంబంధించిన వికాసాన్ని 'మేధోవికాసం' (Intellectual Development) అనీ, శారీరక దారుఢ్యానికి, ఆరోగ్యానికి సంబంధించిన వికాసాన్ని 'శారీరకవికాసం' (Physical Development) అనీ, వివిధ పనుల్లో నైపుణ్యానికి సంబంధించిన వికాసాన్ని 'నైపుణ్యాలవికాసం' (Skill Development) అనీ, తన చుట్టూ ఉన్న సమాజంతో చక్కటిసంబంధాలు ఏర్పరచుకోవటాన్ని 'సాంఘికవికాసం' (Social Development) అనీ పేర్కొంటున్నారు. అలాగే మంచీ–చెడు విచక్షణ, సామాజిక నిబంధనల గురించిన ఆలోచన, సార్వత్రిక మానవీయ విలువల పట్ల గౌరవం, నిబద్ధత కలిగి ఉండడం, ఇవన్నీ 'నైతికవికాసా'నికి (Moral Development) సంబంధించినవి. విద్యార్థి తన ఉద్వేగాలపై అదుపు సాధించడం ఎంతో ముఖ్యమని భావిస్తూ 'ఉద్వేగవికాసా'నికి (Emotional Development) ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ వికాసాలన్నింటి మధ్య అంతర సంబంధాలున్నాయి. అన్ని వికాసాలూ విద్యార్థి పరిపూర్ణవికాసానికి ముఖ్యమే. ప్రతి విద్యార్థీ అన్ని వికాసాలలోనూ తన శక్తిమేరకు, తన ప్రయత్నం మేరకు వికసించటానికి విద్య దోహదం చేయాలి. నిజానికి 'విద్య' లక్ష్యం ఇదే.

విద్యార్థి పరిపూర్ణ వికాసానికి ముఖ్యమైనవి విద్యా ప్రణాళిక (curriculum) విద్యా ప్రణాళికలో పైన పేర్కొన్న వికాసాలన్నింటికి సముచిత స్థానం, సమయం కేటాయించాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం 2011 (A.P.State Curriculum Framework - 2011) లో ఎప్పటిలాగే మేధోవికాసానికి అవసరమైన జ్ఞానానికి, దానికి సంబంధించిన ఇతర నైపుణ్యాలకూ పెద్దపీట వేసినా, శారీరకవికాసానికి అవసరమైన ఆటలు, క్రీడలు, వ్యాయామం, యోగా, కళలు, జీవన నైపుణ్యాలకు (Life Skills) ఎంతో ప్రాధాన్యత ఉందని, ఇవి లేకుండా విద్యాకార్యక్రమాలు అసంపూర్ణమనీ, వీటిని తప్పకుండా ప్రతి పాఠశాలా అమలు చేయాలని స్పష్టంచేసింది. 'జీవన నైపుణ్యాల'ను క్రొత్తగా పేర్కొంది.

మన రాష్ట్రానికి సంబంధించిన విద్యాప్రణాళిక అమలులో కూడా కొన్ని ఆహ్వానించదగిన పరిణామాలు వచ్చాయి. జ్ఞాన సముపార్జన కృత్యాల ద్వారా, ప్రాజెక్టు పద్ధతి ద్వారా సాధ్యమైనంత వరకు జరగాలని నిర్దేశించారు. మూల్యాంకనంలో (evaluation) కూడా మార్పులొచ్చాయి.

కొన్ని ప్రశ్నలకు సమాధాలను వల్లెవేయడం ద్వారా కాకుండా, విషయాన్ని అవగాహన చేసుకుని, అన్వయించుకుని, ఆలోచించి సమాధానాలు వ్రాసేటట్లుగా మూల్యాంకనంలో మార్పు వచ్చింది. కానీ, విద్యాప్రణాళికను అమలు చేయటంలోనే మార్పు వచ్చింది. కానీ విద్యా ప్రణాళికను అమలు చేయడంలోనే అసలు సమస్యంతా!

ఈ నేపథ్యంలో విద్యార్థి పరిపూర్ణ వికాసానికి పాఠశాల విద్యను ఎలా అమలు చేయాలనే చర్చలో నా ఆలోచనలను మీతో పంచుకుంటాను.

**విద్యార్థి కేంద్రకంగా విద్యాబోధన జరగాలి**

విద్యార్థి ఒక్కడుగానూ, విద్యార్థి సముదాయంగానూ, కృత్యాల ద్వారా, ప్రాజెక్టు పద్ధతి ద్వారా, పనులు చేయడం ద్వారా నేర్చుకునేట్లు పాఠ్యప్రణాళికను ముందే తయారుచేసుకుని తరగతిలో అమలు చేయాలి.

విద్యార్థుల తెలివితేటల్లో, నేర్చుకునే వేగంలో, శ్రద్ధలో తేడాలుంటాయని మనందరికీ తెలుసు. కానీ నేర్చుకునే శైలిలో, పద్ధతిలో కూడా తేడాలుంటాయి. కొంతమంది విద్యార్థులు టీచర్ల ఉపన్యాస పద్ధతిలో బోధించినా నేర్చుకోగలరు. కానీ కొంతమంది ఒక ఆట ద్వారానో, ఆసక్తి కలిగే కృత్యం ద్వారానో, సముదాయ ప్రాజెక్టు ద్వారానో నేర్చుకోగలరు. వారు ఎలా నేర్చుకుంటున్నారో గమనిస్తూ ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతిని, బోధనాభ్యసన కృత్యాలనూ మలచుకోవాలి.

దాదాపు 37 సంవత్సరాల క్రితం ఉపాధ్యాయ వృత్తిలో చేరినప్పుడు మొదటి రోజు బోధించిన తర్వాత నాకు వెంటనే స్ఫురించింది ఇదే. విద్యార్థులు ఎలా నేర్చుకుంటున్నారో గమనిస్తూ నా బోధనలో మార్పులు, చేర్పులు చేసుకోవాలని.

ఈ మధ్య 'Teaching - Learning' గురించి ఒక ఉపన్యాసం తయారు చేసుకుంటున్నపుడు కిర్క్‌గార్డ్ (Kierkegard, 1813-1855) అనే తత్త్వవేత్త సుమారు 250 సంవత్సరాల క్రితం చెప్పిన విషయం చదివాను. ఈ సందర్భంలో ఆయన మాటలను ఉదహరిస్తున్నాను.

"ఉపాధ్యాయుడిగా నీవు విద్యార్థినుంచి నేర్చుకుంటున్నప్పుడే బోధన మొదలయినట్లు.

నిన్ను నీవు విద్యార్థి స్థానంలో ఉంచుకుని చూడు... విద్యార్థి ఏం నేర్చుకుంటున్నాడో, ఎలా అర్థం చేసుకుంటున్నాడో గ్రహిస్తావు"

"Instruction begins when you, the teacher learn from the learner.

Put yourself in his place so that you may understand what he learns

and the way he understands it"

– (Kierkegard - a philosopher, 1813-55)

నెమ్మదిగా నేర్చుకునేవారికి ప్రత్యేక కృత్యాలు నిర్వహించడం ద్వారానో, శ్రద్ధ, ఆసక్తి కలగడానికి అవసరమైన శ్రద్ధను వారిపట్ల చూపటం ద్వారానో, వారూ వారి శక్తి కొలది కృషిచేసి ఆ సబ్జెక్టులో అవసరమైన మేరకు వికాసం కలిగేట్లు ప్రోత్సహించాలి. అప్పుడే తరగతిలోని విద్యార్థులందరూ ప్రతి సబ్జెక్టులోనూ అవసరమైన కనీసప్రమాణాలకు చేరుకుంటారు. తరగతిలో కొంతమంది 'ప్రతిభ' కలిగిన విద్యార్థులుంటారు. వారికి ఉత్సాహం కలిగితే, సవాలుగ నిలిచే ప్రాజెక్టులు, సమస్యలు ఇవ్వాలి. వారికీ తరగతి వెలుపల కొంత సమయం ఇవ్వవలసి ఉంటుంది. సముదాయంగా నేర్చుకోవడం (Peer group Learning), సహకరిస్తూ నేర్చుకోవడం (Cooperative Learning), విద్యార్థి స్వంతంగా నేర్చుకోవడం (Independant Learning) ఒక పాఠశాలలో అందరు ఉపాధ్యాయులూ అవగాహనతో శ్రద్ధతో అమలు చేసినట్లయితే – విద్యార్థి కేంద్రక విద్యాబోధన సాధ్యమే.

**"విద్యార్థి కేంద్రక విద్య విద్యార్థి పరిపూర్ణ వికాసానికి అవసరం"**

ప్రతి తరగతిలోనూ నేర్చుకునే వివిధ సబ్జెక్టులను అనుసంధానం a చేసుకుంటూ సమగ్ర జ్ఞాన సముపార్జన దశలో విద్యాబోధన జరగాలి. మూల్యాంకన పత్రాలూ, ఇతర మూల్యాంకన పద్ధతులూ అందుకు అనుగుణంగా తయారు చేసుకోవాలి.

నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని బట్టి (Formative Assessment) ఒక అంశం ఎక్కువ మంది విద్యార్థులు నేర్చుకోలేకపోయారు అని తెలినప్పుడు అదే అంశాన్ని వారే ఏ పద్ధతి ద్వారా, ఏ అభ్యసన కృత్యాల ద్వారా నేర్చుకోగలరో ఆలోచించి ఉపాధ్యాయుడు మరల బోధించాలి.

ప్రాథమిక విద్యా దశ ఎంతో ముఖ్యమైనది. భాషలో, గణితంలో, పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన నైపుణ్యాలలో విద్యార్థికి పునాది ఏర్పడేది ఈ దశలోనే. "స్వంతంగా నేర్చుకోవడానికి తర్ఫీదు ఈ దశలోనే జరగాలి. ఈ దశ పూర్తయ్యేటప్పటికి ఎక్కువమంది 'Independant Learners' కాగలిగితే "విద్యార్థి కేంద్రక విద్య" సాధ్యమౌతుంది. విద్యార్థి స్వంత కృషి ద్వారా వికసించడానికి వీలుంటుంది.

**"స్వంత కృషి ద్వారా వికసించడమే మార్గం"**

పనిచేయటంలో సంతోషం, ఉత్సాహం, పని విలువ తెలియటం, సముదాయంలో కలిసి పనిచేయటం (స్కూలులోనూ, ఇంటి దగ్గరా కూడా) ప్రాథమిక దశలోనే విద్యార్థిలో అంతర్లీనం కావాలి. పాఠశాలలోనూ, ఇంటిదగ్గరా క్రమపద్ధతిలో పనిచేయటం, తన పనులన్నీ తానే స్వంతంగా చేసుకోవడానికి తగిన వాతావరణం ఉండాలి. అవసరమైన మేరకే తల్లితండ్రులు తోడ్పడాలి.

పరిసరాల విజ్ఞానం పూర్తిగా పనుల ద్వారా, కృత్యాల ద్వారా, ప్రాజెక్టుల ద్వారానే నేర్పవచ్చును.

**“తరగతిగదిలో కూర్చోబెట్టి Verbal గా పరిసరాల విజ్ఞానం బోధించడం అర్థం లేనిది....”**

6వ తరగతినుండే సైన్సు ఒక సబ్జెక్టుగా ప్రవేశపెడతారు. భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు ఈ తరగతిలో పునాది ఏర్పడుతుంది. వీటిని నేర్చుకోవడానికి అతి తక్కువ ఖర్చుతో ప్రయోగశాలలను, తోటను పాఠశాల ఏర్పాటు చేసుకోవాలి. వ్యర్థ పరికరాలెన్నింటినో ఉపయోగించి అతి తక్కువ ఖర్చుతో ప్రయోగశాలలను ఏర్పాటుచేసుకోవచ్చు. ప్రయోగాలు చేయటం ద్వారా విద్యార్థులే సూత్రాలూ, సమీకరణాలూ కనుగొనే విధంగా సైన్సు బోధన జరగాలి. ప్రయోగం చేసే విధానం ఉపాధ్యాయుడు చెప్పవచ్చును. కానీ వచ్చే ఫలితాలను చెప్పకూడదు. విద్యార్థులను జట్లుగా విభజించి ఎవరి పరిశీలనలను, ఫలితాలను, వారినే వ్రాయమనాలి. ఆ తరువాత చర్చ. చర్చ ద్వారా విద్యార్థులు సూత్రాలను కనుగొనడం, ఆ సూత్రాలకు ఇతర అప్లికేషన్ల గురించి ఆలోచించడం జరగాలి. సైన్సు నేర్చుకోవటంలో observation, exploration, experimentation, analysis, synthesis, generalisation skills విద్యార్థులు నేర్చుకోవాలి. “వల్లెవేయడం ద్వారా సైన్సు నేర్చుకోవటం” హీనస్థాయి. Open ended experiment, Open ended porjects 6వ తరగతినుండే ప్రారంభం కావాలి. భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలో నేర్చుకుంటున్న ప్రధాన సూత్రాలకు, జ్ఞానానికి వీలైన చోటల్లా అనుసంధానం చేసుకుంటూ సైన్సు నేర్చుకోవాలి.

కొంతమంది విద్యార్థులకు క్రొత్త ఆలోచనలొస్తాయి. సమాజంలోని ఎన్నో సమస్యలకు స్పందించి పరిష్కారాల కోసం అన్వేషిస్తారు. పాఠశాలలోనే స్ఫూర్తిని ఇవ్వాలి. అవకాశం ఇవ్వాలి. గొప్ప శాస్త్రవేత్తలతో పరిచయం, ప్రసంగాలు, ప్రశ్నోత్తరాలు పాఠశాల స్థాయిలోనే జరగాలి. వారి పరిశోధనలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వటానికి పాఠశాల ఉపాధ్యాయులే కాక, దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లోని ప్రొఫెసర్లనూ, జాతీయ పరిశోధనశాలల్లోని శాస్త్రవేత్తలను approch కావచ్చును. వేసవి సెలవుల్లో ఆ శాస్త్రవేత్తల పరిశోధనశాలల్లో పరిశోధనలు కొనసాగించవచ్చును. పాఠశాలలకు, కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు, జాతీయ పరిశోధనశాలలకు మధ్య అనుసంధానం ఏర్పడాలి. యువశాస్త్రవేత్తలు అభివృద్ధి చెందాలంటే ఇలాంటి networking తప్పనిసరి. Deprartment of Science and Technology (DST), Govt. Of India INSPIRE programme లక్ష్యమే ఇది..

**“పాఠశాలల్లో ఉన్నప్పుడే విద్యార్థుల పరిశోధనలకు కొన్ని స్కాలర్‌షిప్‌ల ద్వారా ప్రభుత్వం ప్రోత్సహించాలి”**

కొంతమంది విద్యార్థులకు గణితంలో ఎంతో ప్రతిభ ఉంటుంది. వీరు గణితంలో చిన్నచిన్న ప్రాజెక్టులు, పరిశోధనలు చేయటాన్ని ప్రోత్సహించాలి. Algebra, Geometry, Calculus, Trigonometry నేర్పేటప్పుడు concrete examples, నిత్యజీవితంలోని ఉదాహరణలు

ఉపయోగించి భావనలు నేర్పి ఆ తరువాత Abstract Equationsకు తీసుకెళ్ళాలి. గణితానికి సైన్సు సబ్జెక్టులకు, గణితానికి–జీవితానికి ఎంతో సంబంధముందని స్కూలుస్థాయిలోనే విద్యార్థులు గ్రహించగలగాలి.

సైన్సు, గణితం, సాంఘికశాస్త్రం, భాషలకు స్కూలు స్థాయిలోనే సమాన ప్రాధాన్యతను ఇవ్వాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ పాఠశాలల్లో, ఇంచుమించు అన్ని కుటుంబాలలో సైన్సుకు, గణితానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, ఎక్కువ సమయం నేర్చుకోవటానికి కేటాయిస్తూ, సాంఘికశాస్త్రాన్ని, భాషలను చిన్నచూపు చూస్తున్నారు. ఇది చాలా పెద్ద తప్పు.

విద్యార్థుల్లో సాంఘికవికాసానికి సాంఘికశాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. సివిక్స్ ద్వారా సమాజంలో బాధ్యతగల పౌరునిగ జీవించటానికి అవసరమైన పునాది వేయాలి. మానవచరిత్రను, నాగరికతలను, వివిధ దేశాల భౌగోళిక స్వరూపాలను, వివిధ రకాల పరిపాలనలను, ప్రజాస్వామ్య ప్రత్యేకతను, విలువలను చర్చల ద్వారా, విజ్ఞానయాత్రల ద్వారా, చిన్న చిన్న documentary films ద్వారా విద్యార్థులు ఉత్సాహంగా నేర్చుకునేటట్లు చేయవచ్చును. సమకాలీన సమాజాన్ని, మానవ సంబంధాలను, సమస్యలను చర్చలద్వారా విద్యార్థులు విశ్లేషించేందుకు తగిన అవకాశం, సమయం పాఠశాల విద్యాప్రణాళికలో తప్పనిసరిగా ఉండాలి. Moc Parliament, Moc Assembly, Moc Courts ను ఈ చర్చలకు వేదికగా చేసుకోవాలి. మానవ హక్కులు, బాధ్యతలను గురించిన అవగాహన పాఠశాల స్థాయిలోనే మొదలవ్వాలి. *"తన స్వార్థం నుంచీ, తన కుటుంబ స్వార్థం నుంచీ బయటపడి సామాజిక స్పృహ కలిగేలా, తన పరిధిని, తన ఆలోచనలనూ ఎంత విశాలం చేసుకుంటే, మానవజీవితానికి అంత సార్థకత"* అనే మానవతా విలువను గురించి ఆలోచనలు, చర్చలు పాఠశాల స్థాయిలో జరగాలి. సాంఘికశాస్త్రం ద్వారాగానీ, భాషల ద్వారాగానీ, సైన్సులో ఆవిష్కరణలను పరిచయం చేసేటప్పుడుగానీ గొప్ప జీవితాలను పరిచయం చేయాలి. జీవన నైపుణ్యాలకు (Soft Skills) తన భావాలను స్పష్టంగా, మర్యాదగా, సంస్కారయుతంగా తెలియచేయడం ముఖ్యం. ఈ నైపుణ్యానికి భాషల్లో పట్టు ముఖ్యం. భాషలు నేర్పడానికి పాఠ్యాంశాలు ఆధారాలు మాత్రమే. ప్రతి తరగతి స్థాయిలోనూ నేర్చుకోవలసిన భావప్రకటనా నైపుణ్యాల (communication skills) స్థాయిని, ప్రమాణాలను లక్ష్యాలుగ (outcomes) ఉపాధ్యాయులు, విద్యార్థులు గుర్తుంచుకోవాలి. మౌఖిక భావప్రకటనా నైపుణ్యాన్ని (oral communication skills) లిఖిత భావప్రకటనా నైపుణ్యాన్ని (written communication skills) అంచనా వేసేందుకు మూల్యాంకన పద్ధతులను (Evaluation methods) అమలుచేయాలి (అవలంబించాలి). ఈ నైపుణ్యాలు సాంఘిక వికాసానికి దోహదం చేస్తాయి.

**విద్యార్థులలో విలువల స్థాపనకు, నైతిక వికాసానికి సాంఘికశాస్త్రం, భాషలు దోహదం చేస్తాయి.**

విద్యార్థుల్లో నైతిక వికాసానికి తల్లితండ్రుల ప్రవర్తన, ఉపాధ్యాయుల ప్రవర్తన, పాఠశాల వాతావరణం, చుట్టూ ఉన్న సమాజం ఎంతో ప్రభావితం చేస్తాయి. కొంతమంది విద్యార్థులకు గొప్ప ఉపాధ్యాయులు ప్రేరణ కావచ్చు. “ఒక్క ఉపాధ్యాయుని ప్రేరణ ఆయన జీవితకాలంలో ఎంతోమంది విద్యార్థులకు మార్గదర్శనం కావచ్చు. ఆ ప్రేరణలో ప్రభావితమైన విద్యార్థి స్వంత కృషితో నైతిక వికాసం, మానసిక వికాసం, సాంఘిక వికాసం, మేధో వికాసాలలో పరిణతి చెందడానికి నిరంతరం ప్రయత్నిస్తాడు”.

విద్యాప్రణాళికలో, విద్యా కార్యక్రమాల్లో ‘కళ’లకు సముచితస్థానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ స్థానాన్ని సరిగా అర్థం చేసుకోవలసి ఉంది. సమయం, వనరులు లభించినప్పుడు వినోద కార్యక్రమాలుగ కళలను పరిగణిస్తున్నారు. రాష్ట్రవిద్యాప్రణాళికా పరిది పత్రం నుండి కొన్ని వాక్యాలను ఇక్కడ ఉదహరిస్తున్నాను.

“పాఠశాలలో జరిపే కొన్ని సందర్భోచిత కార్యక్రమాలను ఆకర్షవంతం చేయుటకు ఉపయోపడే అలంకరణ సామగ్రిగా పిల్లలను భావిస్తూ వారిని పాటలు పాడడానికి, నృత్యం చేయడానికి, చిన్న చిన్న నాటికలలో పాల్గొనడానికి ఉపయోగించడం జరుగుతుంది. ఇలాంటి అకృత్రిమ, అర్థరహిత కార్యక్రమాలకు కళలను ఉపయోగించడం చాలా ఘోరం. సమాజ సాంస్కృతిక వారసత్వాన్ని తర్వాత తరానికి అందించడానికే కాక కళాత్మక ఉత్పాదనలో మిళితమైన నైపుణ్యాలు, ప్లిలల యొక్క సంపూర్ణ భావావేశ మరియు జ్ఞానాత్మక అభివృద్ధికై అత్యవసరం”

ఏదైనా ఒక విషయాన్ని పిల్లలకు హత్తుకునేలా నేర్పటానికి కళలు మాధ్యమాలుగ ఉపయోపడతాయి. ప్రాథమికస్థాయిలో భాషలను నేర్పటానికి పాత్రపోషణ (Role Play) ఎంతో ఉపయోగపడుతుంది. విలువల స్థాపనకు, సమాజంలోని మూఢనమ్మకాలను గుర్తించటానికి కళారూపాలను (నాటకం, వీధినాటకం, నృత్యనాటకం) వినియోగించుకోవచ్చును.

విద్యార్థి పరిపూర్ణ వికాసానికి కళలు ఎంతో దోహదం చేస్తాయని తెలిసిన విషయమే. సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, పెయింటింగ్, మట్టితో కళాకృతులను చేయటం మొదలైన కళలను నేర్చుకోవడానికి తగిన వనరులూ, ఉపాధ్యాయులూ పాఠశాలలో ఉండాలి. ప్రతి విద్యార్థీ తనకు ఆసక్తి కలిగిన ఏదో ఒక కళారూపాన్ని ఎంచుకొని దానిలో కనీస ప్రావీణ్యతను సాధించానికి పాఠశాల అవకాశం కల్పించాలి. కళల్లో సాధనకు తల్లితండ్రులూ ప్రోత్సహించాలి. కళల్లో సాధన ఇతర వికాసాలపైన సానుకూల ప్రభావాన్ని చూపుతుంది.

ఆటలు, క్రీడలు, వ్యాయామం, యోగ విద్యలు విద్యార్థి పరిపూర్ణ వికాసానికి ఎంతో ముఖ్యమైనవి. శారీరక వికాసానికే కాక, మానసిక వికాసానికి, ఉద్వేగ వికాసానికి, సాంఘిక

వికాసానికి, ఇవి దోహదం చేస్తాయి. ప్రతి విద్యార్థి ప్రతి రోజూ ఓ 40ని॥ల సమయం పాఠశాలలో వీటిలో తనకిష్టమైన దానిలో పాల్గొనడానికి అవకాశముండాలి. ఎన్నోరకాల ఆటలకు, క్రీడలకు సరిపడిన ప్రాంగణం, వనరులు, ఉపాధ్యాయులను పాఠశాల ఏర్పాటుచేయాలి. విద్యార్థులను అన్నింటిలో మీకేది ఇష్టమని అడిగితే 'ఆటలు' అని ఠక్కున చెప్తారు. 'చదువుల పేరిట' పిల్లలను ఆటలకు దూరం చేయడంకంటే పెద్ద అన్యాయం లేదు. పిల్లలకు ఆటలనుంచీ దూరం చేసిన పాఠశాలలు వారికి శత్రువులే. చూసీచూడనట్లు ఊరుకున్న తల్లితండ్రులూ పిల్లలను బాల్యానికి దూరం చేసినట్టే.

బాల్యంలో ఆడుకోవడం "బాలల హక్కు"గా నేను భావిస్తాను. ఈ హక్కును వారికి దూరం చేయడానికి ఎవరికీ హక్కులేదు. 'ఇటు తల్లితండ్రులూ, అటు స్కూళ్ళూ పిల్లల వికాసానికి అవరోధం కలిగించటమే' మన సమాజంలో నేను గమనిస్తున్న విషయం. తమ పిల్లల మేలు కోరే తల్లితండ్రుల్లో మొదట మార్పు రావాలి.

**"ఆటలకు వీలులేని స్కూలు స్కూలే కాదు... అక్కడ బోధించే విద్య విద్యే కాదు..."**

- సృజనాత్మకతకు ప్రతి విద్యా కార్యక్రమంలోనూ అవకాశం ఉంది. ఉపాధ్యాయుని బోధనలోనూ, విద్యార్థులు నేర్చుకోవడంలోనూ సృజనాత్మకతను పెంచి పోషించాలి. సృజనాత్మకత వెలికివచ్చే కార్యక్రమాలు విద్యార్థి పరిపూర్ణ వికాసానికి దోహదం చేస్తాయి. విద్యార్థి వికాసం అతనిలోని సృజనాత్మకతను పెంపొందిస్తుంది.
- విద్యార్థికి తన సామర్థ్యాలు, పరిమితులు; ఆసక్తులూ, అనాసక్తులూ; తనకున్న అవకాశాలూ, తన ముందున్న సవాళ్ళూ; పదవ తరగతి అయ్యేటప్పటికి కొంత ఆలోచన, అవగాహన ఉండాలి. సమాజంలో ఉన్న ఎన్నో వృత్తులలో ప్రావీణ్యత సాధించిన వారి ద్వారా ఆయా వృత్తి వివరాలను, వృత్తికవసరమైన సామర్థ్యాలను విద్యార్థులకు స్కూలుస్థాయిలోనే పరిచయం చేయాలి. ఈ బాధ్యతను స్కూలు తల్లితండ్రుల కమిటీగానీ, కొన్ని పాఠశాలలు కలిసిగానీ తీసుకోవచ్చు. ఇలాంటి కార్యక్రమాలను వేసవి సెలవుల్లో నిర్వహించుకోవచ్చు. తన career కు అనుగుణంగా పై చదువులను ఎంపిక చేసుకోగలిగే clarity విద్యార్థికి ఏర్పడాలి. ఈ clarity లేకపోవడం వల్ల తల్లితండ్రుల ఇష్టమో, తోడి విద్యార్థుల ఇష్టమో తన ఇష్టంగా భావించి తన శక్తిసామర్థ్యాలకు విరుద్ధమైన చదువులను, కోర్సులను ఎంపిక చేసుకొని ఎంతోమంది విద్యార్థులు నష్టపోతున్నారు. ఆ చదువులు వారి వికాసానికి అవరోధాలుగా మారుతున్నాయి.
- "ఎంతోమంది విద్యార్థుల విషయంలో ఈ 'విద్య కాని విద్య' వికాసానికి దారితీస్తుందా? వికాసానికి అవరోధాన్ని కలిగిస్తోంది" అనే ప్రశ్న ఎప్పుడూ నాకు మనసులో మెదులుతూ ఉంటుంది.

- “అలాగే మన దేశంలోని ఎక్కువ పాఠశాలల్లో అందించే విద్య వికాసానికి దారితీస్తోందా? అవరోధమా?”
- “ఎంతోమంది తల్లితండ్రులు, ముఖ్యంగా పిల్లల విద్యకోసం ఎంతో డబ్బు, సమయం వెచ్చిస్తున్న తల్లితండ్రుల ప్రభావం వల్ల, ఇంటి వాతావరణం వల్ల పిల్లలకు వికాసం కలుగుతోందా?”
- “మన సమాజం పిల్లల వికాసానికి నిజంగా దోహదం చేస్తోందా?”
- “Media, Internet, Consumerism ప్రభావాల మాటేమిటి?” ...........ఎన్నో ప్రశ్నలు. మార్పు ఎక్కడ మొదలవాలి?

**ముగింపు :**

విద్యార్థి పరిపూర్ణ వికాసానికి దోహదం చేసే విద్యా ప్రణాళికను, విద్యా కార్యక్రమాలను అమలు చేయడంలో ఉపాధ్యాయులే కీలకం. ఉపాధ్యాయులకు నిరంతరంగా శిక్షణా తరగతులను నిర్వహించాలి. ఈ తరగతులను నిర్వహించగలిగే సామర్థ్యం ఉన్న ఉపాధ్యాయులు కూడా చాలా తక్కువ మంది ఉన్నారు. త్వరగా వీరి సంఖ్య కూడా పెరగాలి.

ఉపాధ్యాయులు సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన వేతనాలూ, ఇతర సౌకర్యాలూ సమకూర్చడం ద్వారా శక్తిసామర్థ్యాలున్న వారిని ఉపాధ్యాయ వృత్తికి ఆకర్షించాలి. ప్రాథమిక ఉపాధ్యాయుడికి విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుడికి వేతనాల్లో ఎంత తేడా? ప్రాథమిక ఉపాధ్యాయుని వేతనాలు ఇంకా ఎక్కువగా ఉండాలని నా అభిప్రాయం.

విద్యార్థుల వికాసమే సమాజవికాసం. సమాజవికాసం మీదే శాంతి సౌఖ్యాలతో కూడిన కుటుంబాలూ, రాష్ట్రప్రగతీ, దేశప్రగతీ ఆధారపడి ఉంటాయి. పరిపూర్ణ వికాసానికి దోహదం చేసే పాఠశాలలను తల్లితండ్రులు ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు ప్రత్యేక గ్రాంట్ల ద్వారా ప్రోత్సహించాలి. వ్యాపార విద్యలో మునిగి ఉన్న పాఠశాల యాజమాన్యాలు ‘వికాసవిద్య’ వైపు మార్గనిర్దేశం చేసుకోవాలి.

పరిశ్రమల యాజమాన్యాలు corporate social responsibility కు ప్రక్కనపెట్టే నిధులనుంచి “వికాస విద్య పాఠశాల”లను నెలకొల్పాలి.

అందరూ తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తేనే “పరిపూర్ణ వికాస విద్య”ను అందించే పాఠశాలల సంఖ్య పెరుగుతుంది. ఏనాటికైనా ఆ దిశలో పయనించాల్సిందే. ఎంత త్వరగా పయనిస్తే మనందరికీ అంత మంచిది.

ప్రచురణలు

అభ్యాస విద్యాలయం
దీపా మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు
విజయవాడ

9440579922